క్లుప్తంగా

పరిహారం అందజేత



మాచారెడ్డి: మండలంలోని అక్కాపూర్ అటవీ ప్రాంతంలో ఇటీవల చిరుత దాడిలో మృతి చెందిన లేగదూడ యజమానికి అటవీశాఖ అధికారులు బుధవారం పరిహారం అందజేశారు. లేగదూడ యజమాని అరిగే నర్సింలుకు రూ.18వేల నగదు చెక్కును అందజేశారు. ఎఫ్‌డీవో రామకృష్ణ, ఆర్‌డీవో వీణ, తహసీల్దార్ సరళ, అటవీ శాఖ సిబ్బంది ఫారుఖ్, రమేశ్, సంతోష్ తదితరులున్నారు.

ఉత్తమ ఉర్దూ టీచర్ అవార్డు ప్రదానం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు నాజియా మస్రత్ తెలంగాణ ఉర్దూ అకాడమీ ఉత్తమ ఉర్దూ టీచర్ అవార్డు(2022–23) అందుకున్నారు. ఈ అవార్డు కింద నాజియా మస్రత్‌కు శాలువాతో సన్మానం, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటు రూ.25 వేల నగదు అందజేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కమిషనర్ షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

'రక్తవీర్' జాతీయ స్థాయి పురస్కారం ప్రదానం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ ఎస్.బాలు జాతీయ స్థాయి రక్తవీర్ పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్, ఐవీఎఫ్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి న్యూఢిల్లీలోని హోటల్ అశోకాలో నిర్వహించిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ రవీందర్ గుప్తా, ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు బాలుకు రక్తవీర్ పురస్కారం అందజేశారు. బాలు రక్తదాన శిబిరాల ద్వారా 25వేలకు పైగా యూనిట్ల రక్తం సేకరించడం, తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం, వ్యక్తిగతంగా ఇప్పటికి 77 సార్లు రక్తదానం చేసినందుకు గుర్తింపుగా జాతీయ స్థాయి పురస్కారం అందజేశారు.

అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు



ఎల్లారెడ్డి: గండిమాసానిపేట జెడ్పీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు వెంకటరమణ పలుమార్లు రక్తదానం చేసినందుకు ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ రవీందర్‌గుప్తా చేతుల మీదుగా రక్తవీర్ అవార్డును అందుకున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గుప్తా తదితరులున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎంఈవో ఆనంద్‌రావు



రామారెడ్డి: హరిత ఫౌండేషన్(హైదరాబాద్) ఆధ్వర్యంలో బుధవారం రామారెడ్డి మండల కేంద్రంలోని హైస్కూల్లో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో ఆనంద్‌రావు తెలిపారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవిత చరిత్ర, దేశానికి అందించిన సేవలు, టెక్నాలజీ రంగం అంశాలపై ఉపన్యాస పోటీలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. మొదటి స్థానం భవిత(మద్దికుంట జెడ్పీహెచ్ఎస్), రెండో స్థానం వారధిని(రెడ్డిపేట జెడ్పీహెచ్ఎస్), మూడో స్థానం రాంచరణ్, వేదాశ్రీలు బహుమతులు గెలుచుకున్నట్లు వెల్లడించారు. మొదటి స్థానం సాధించిన విద్యార్థికి రూ.5 వేలు, 2వ స్థానంలో విద్యార్థికి రూ.2 వేలు, 3వ స్థానం సాధించిన విద్యార్థికి రూ.2 వేల నగదు అందజేశారు. ఫౌండేషన్ అధికార ప్రతినిధి మంజూర్ హుస్సేన్, ఉపాధ్యాయులు శ్రీనివాసన్, మనోహర్, రాజలింగం, బాలరాజు, విష్ణు, కృష్ణ ప్రసాద్, ఖాసిం, లత, తదితరులు పాల్గొన్నారు.

తీవ్రంగా ధ్వంసమైన రోడ్లు



తిమ్మనగర్ గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న నీరు (ఫైల్)



వర్షాలకు కొట్టుకుపోయిన కంభాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు

పిట్లం(జుక్కల్): కంబాపూర్ నుంచి గోద్మెగాం వరకు బీటీ రోడ్డు వరద తాకిడి కారణంగా దెబ్బతిన్నది. రోడ్డు మధ్యలో ఉన్న వంతెన సైతం వరద కారణంగా కొట్టుకుపోయింది. అలాగే రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రోడ్డుపై వాహనాలు నడిచే పరిస్థితి అయితే లేదు. కాలినడకన ప్రయాణించాలంటే కూడ ప్రయాణికులు జంకుతున్నారు. ఈ రోడ్డు వెంట ఉన్న గ్రామాల నుంచి మండల కేంద్రానికి సుమారు 50 మంది విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు ప్రతి రోజూ వెళ్తుంటారు. వాహనాలు నడవకపోవడంతో గోద్మేగాం వరకు కాలి నడకన వస్తూ అక్కడి నుంచి ఇతర వాహనాల్లో మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. గ్రామస్తులకు ఏ అవసరమున్నా గోద్మెగాం మీదుగా పిట్లం వరకు రావాల్సి ఉంటుంది. కంబాపూర్, గోద్మెగాంల మధ్య చెడిపోయిన రోడ్డుకు మరమ్మతులు చేసి తమ ఇబ్బందులను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అదే విధంగా భారీ వర్షాలు కురిసినప్పుడు పిట్లం నుంచి తిమ్మనగర్ గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న లోలెవెల్ వంతెనపై నుంచి నీళ్లు ప్రవహిస్తున్నాయి. పిట్లం నుంచి కల్లేర్ మండలానికి వెళ్లే రహదారిపై ఉన్న వంతెనపై నుంచి కూడా నీళ్లు ప్రవహిస్తాయి. ఈ కారణంగా కల్లేర్, తిమ్మనగర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. తిమ్మనగర్ గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న లోలెవెల్ వంతెనల స్థానంలో హై లెవెల్ వంతెనలను నిర్మించాలని, అదే విధంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెడిపోయిన రోడ్లను వెంటనే బాగు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వాహనాలు రావడం లేదు



గ్రామంలో ఎవరినైనా ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే అధ్వానమైన రోడ్డును చూసి వాహనాలు రావడంలేదు. చాలా ఇబ్బందిగా ఉంది. స్కూల్ బస్సులు కూడా రావడం లేదు. పిల్లలు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. కాలినడకనే గోద్మేగాం వరకు వెళ్తి అక్కడి నుంచి ఇతర వాహనాలలో పిట్లంకు వెళ్తున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే రోడ్డును బాగు చేయించాలి.

– గంగారాం, కంభాపూర్

మరమ్మతులు చేయాలి



ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు, వంతెన కొట్టుకుపోయి ఇబ్బందులు పడుతున్నాం. ప్రతి చిన్న విషయానికి మా గ్రామం నుంచి గోద్మెగాం, పిట్లంకు పోతుంటాం. అలాంటి సందర్భంలో రోడ్డు వరద తాకిడి కారణంగా పూర్తిగా కొట్టుకుపోయి కంకర తేలింది. భారీ గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు, నాయకులు స్పందించి రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపడితే బాగుంటుంది.

– శివురం, కంభాపూర్

నేటి చిత్రం



కంకర తేలి గుంతలు పడ్డ మద్దికుంట రోడ్డు

గుంతలమయంగా మద్దికుంట రోడ్డు

రామారెడ్డి: మండల కేంద్రం నుంచి ఇసన్నపల్లి మీదుగా మద్దికుంటకు వెళ్లే రోడ్డు మార్గం గుంతలమయంగా మారింది. పలు చోట్ల కంకర తేలిపోయింది. వాహనదారులకు ఇది చాలా ఇబ్బందిగా మారింది. మద్దికుంట బుగ్గ ఆలయానికి భక్తులు నిత్యం వెళ్తుంటారు. అధికారులు, కామారెడ్డి ఎమ్మెల్యే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– సాయిరెడ్డి, మద్దికుంట

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

శిఖం కబ్జాలు అరికట్టాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

నిజాంసాగర్(జుక్కల్): పాతచెరువు శిఖం భూముల కబ్జాలు అరికట్టాలని కోరుతూ బుధవారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో తహసీల్దార్ సవాయిసింగ్‌కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నర్వ గ్రామస్తులు, ఆయకట్టు ప్రాంత రైతులు వినతి పత్రం అందజేశారు. నర్వ గ్రామ పాత చెరువు శిఖం భూముల్లో ఎల్లారెడ్డి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన కొందరు రైతులు పంటలు సాగు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా శిఖం భూముల్లో బోర్లు వేస్తున్నారని పేర్కొన్నారు. కబ్జాలను తొలగించి చెరువు శిఖంను కాపాడాలని తహసీల్దార్‌ను కోరారు. నాయకులు లోక్యానాయక్, కాలిక్, గోర్గంటి రాములు, నవీన్‌గౌడ్, గంగారాం, రాజేష్‌యాదవ్, మల్లయ్యయాదవ్, పోలు, భూమయ్య, శ్రీనివాస్, అంజయ్య, సంతు తదితరులున్నారు.

విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్ల తొలగింపు



లింగంపేట మండల కేంద్రంలో కేబుల్ వైర్లను తొలగిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు



బాన్సువాడలో వైర్లను తొలగిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లతో ప్రమాదాలు జరుగుతుండటంతో టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు వాటిని తొలగిస్తున్నట్లు డీఈ విజయ సారథి తెలిపారు. బుధవారం లింగంపేట మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లు తొలగించినట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న వినాయక చవితి, దుర్గామాత శోభాయాత్ర సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లు తొలగిస్తున్నట్లు తెలిపారు. కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ఆపరేటర్లు సహకరించాలని కోరారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలన్నారు. ఏడీఈ మల్లేశం, ఏఈలు సాయినాథ్, హరీష్‌రావు, సిబ్బంది భాస్కర్, వహీద్, ఆదిరెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ: పట్టణంలో విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్, ఇంటర్నెట్ వైర్లను బుధవారం ట్రాన్స్‌కో అధికారులు తొలగించారు. విద్యుత్ స్తంబాలకు విద్యుత్ తీగలు తప్ప ఎలాంటి వైర్లు ఉండరాదని అన్నారు. ట్రాన్స్‌కో అధికారులు, కేబుల్ ఆపరేటర్లు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో పాపహరేశ్వర ఆలయం ఆవరణలో సైబర్ నేరాలపై హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయని, పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. కావున ప్రజలు సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పురాతన ఇళ్లలో నివాసం ఉండొద్దు



బాన్సువాడ: పురాతన ఇళ్లలో నివాసం ఉండొద్దని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు అన్నారు. బుధవారం పట్టణంలోని 11వ వార్డులో ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయిన ఇళ్లను ఆయన పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. వర్షాల కారణంగా పురాతన ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని, ప్రజలు పెంకుటిళ్లలో నివాసం ఉండవద్దని సూచించారు. కూలిపోయిన ఇళ్ల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని అన్నారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ శ్రీనివాస్, సతీష్, హన్మాండ్లు తదితరులు ఉన్నారు.

'గృహజ్యోతి' పథకానికి అవకాశం కల్పించాలి



ఎల్లారెడ్డి: కొత్తగా రేషన్‌కార్డులు పొందిన వారికి గృహజ్యోతి పథకానికి అర్హులయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్‌ను లబ్ధిదారులు కోరారు. ఈమేరకు బుధవారం ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. అర్హులం కాబట్టే తమకు రేషన్ కార్డులు వచ్చాయని, అలాగే గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని పేర్కొన్నారు. లబ్ధిదారులు మహేష్, నరేష్, ప్రకాష్, సాయి, కరీమ్ తదితరులున్నారు.

రాజీవ్ ఆశయ సాధన కోసం కృషి చేయాలి



నాగిరెడ్డిపేటలో రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో .. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం ముందు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎల్లారెడ్డిలో..



పెద్దకొడప్‌గల్‌లో..



మద్నూర్‌లో..

సాక్షి నెట్‌వర్క్: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశానికి ఐటీ పరిశ్రమలు రావడానికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు.



మాచారెడ్డిలో..



భిక్కనూరులో..



బాన్సువాడలో..



పిట్లంలో..



దోమకొండలో..

నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.50 వేలు చెల్లించాలి

- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



తాండూర్‌లో పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మంజీర వరద ముంపుతో పంటలు నీటమునిగి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. బంజర, తాండూర్, వెంకపల్లి తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించి ముంపునకు గురైన పంటలను ఆయన పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం మండలకేంద్రంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మంజీర వరద వల్ల నాగిరెడ్డిపేట మండలంలో సుమారు 5 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయని చెప్పారు. 5 రోజులుగా పంటలు నీటిలో ఉండడం వల్ల తీవ్ర నష్టం జరిగిందన్నారు. అలాగే సన్న ధాన్యం విక్రయించిన రైతులకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించలేదని గుర్తు చేశారు. పంటలసాగుకు సరిపడా యూరియా సరఫరా కాకపోవడం వల్ల రైతులు సొసైటీ కార్యాలయాల వద్ద చెప్పులు, ఆధార్‌కార్డులు వరుసలో పెడుతున్నారని తెలియజేశారు. ఎల్లారెడ్డి ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సిద్ధయ్య, తాండూర్ సొసైటీ వైస్ చైర్మన్ బాబూరావు, మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ వంశీగౌడ్, నాయకులు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, మురళీ, దుర్గారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యూఎస్‌పీసీ మహాధర్నాను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూఎస్‌పీసీ నేతలు

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ ధర్నా చౌక్‌లో ఈనెల 23న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు సకినాల అనిల్ కుమార్ కోరారు. బుధవారం జిల్లా నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్‌ను పొడగించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు చింతల లింగం, ఆకుల బాబు, ప్రభాకర్, నరేందర్, విజయరామరాజు, వాసు, నరేందర్, నారాయణ తదితరులున్నారు.

సంక్షిప్తం

ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం ఆరోగ్య విస్తర్ణాధికారి నారాయణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది ప్రతిరోజు తమ విధులకు సకాలంలో హాజరు కావాలని, లేకుంటే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఏఎన్ఎం సాబేరా బేగం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో సౌకర్యాలు..



భిక్కనూరు: ప్రభుత్వం మండలానికి కేటాయించిన 108 అంబులెన్స్‌లో ఉన్న సౌకర్యాలను భిక్కనూరు ప్రభుత్వ వైద్యులు యెమిమా గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా అంబులెన్స్‌లో ఉన్న ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్, అత్యవసరంగా ఉపయోగించే వైద్య పరికరాలను, బీపీ మీటర్, వాటిని పరిశీలించి పనితీరును గమనించారు. ఆమె వెంట ఆరోగ్య విస్తర్ణాధికారి వెంకటరమణ ఉన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల ప్రత్యేకాధికారి సతీష్ యాదవ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కల పెంపకంతోనే జీవి మనుగడ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ కాలం పెంపుపై హర్షం



నిజాంసాగర్(జుక్కల్): సహకార సంఘాలతో పాటు జిల్లా సహకార బ్యాంకు పాలక వర్గాల పదవీ కాలం పెంపుపై ఉద్యోగులు, అధ్యక్షులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే తోట. లక్ష్మీకాంతారావును ఉమ్మడి జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడు రమేష్ రెడ్డి, చైర్మన్లు, డైరెక్టర్లు కలిశారు. ప్రభుత్వం తమ కాలపరిమితి పెంచడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేను సన్మానించారు.